కాన్సెప్ట్‌కు హ్యాట్సాఫ్

- యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినూత్నంగా వినాయక చవితి ఉత్సవాలు
- వైవిధ్యభరితంగా.. సందేశాత్మకంగా ప్రతిమల ఏర్పాటు

తాటిచెట్లపాలెం: వినాయక చవితి వస్తుందంటే చాలు.. యువతకు ఒకటే హడావుడి. చవితి పందిరి ఎలా వేయాలి? ఎంత పరిమాణంలో వేయాలి? ఎటువంటి గణపయ్యను ప్రతిష్ఠించాలి అనే ఆలోచనలు, ఏర్పాట్లతో ఎవరికి వారు వైవిధ్యంగా సిద్ధమవుతుంటారు. యువసేవ ఫౌండేషన్ మాత్రం సమాజానికి సందేశాన్నిచ్చే గణనాథుడి విగ్రహాలను ప్రతిష్ఠిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది. జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం లక్ష్మీనారాయణపురంలో యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా ఏర్పాటు చేస్తున్న గణపయ్య ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతి ఏడాది వైవిధ్యభరితంగా.. సందేశాత్మకంగా వినాయక మండపాన్ని రూపొందిస్తున్నారు ఫౌండేషన్ ఫౌండర్ పీలా హరిప్రసాద్.


లక్ష్మీనారాయణపురంలో సిద్ధమవుతున్న మండపం


2020లో ప్రతిష్ఠించిన మాస్క్ వినాయకుడు


పేపర్ టీ కప్స్‌తో గణనాథుడు

విగ్రహాలు.. విశేషాలు

- 2009 నుంచి ప్రతి ఏడాది ఏదో ఒక కొత్త కాన్సెప్ట్‌తో పీలా హరిప్రసాద్ పందిరిని సిద్ధం చేసి వినూత్నంగా వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు.
- ఈ సందేశాత్మక ప్రతిమలను నగర ప్రథమ పౌరుల నుంచి కమిషనర్లు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు ఇలా అనేక మంది సందర్శించి ప్రశంసిస్తున్నారు.
- గతేడాది ప్లాస్టిక్ నిషేధం గురించి తెలియజేసే ప్రకృతి వినాయకుడిని ప్రతిష్ఠించి నిమజ్జనం చేయగా.. ఈ మండపంలో ఏర్పాటు చేసిన మూషికాలు నేటికీ ప్రత్యేక ఆకర్షణగా విశాఖ మ్యూజియంలో చోటు దక్కించుకున్నాయి. యువసేవ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కొన్ని సందేశాత్మక విగ్రహాల విశేషాలు తెలుసుకుందాం..


గతేడాది ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రకృతి గణపతి


విశాఖ మ్యూజియంలో చోటు దక్కించుకున్న యువసేవ ఫౌండేషన్ గతేడాది ఏర్పాటు చేసిన మూషికాలు

మొబైల్ వినాయకుడు

2009లో మొబైల్ వినాయకుడితో తాటిచెట్లపాలెం లక్ష్మీనారాయణపురంలో యువసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పందిరి ఏర్పాటు ప్రారంభించారు. మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల ప్రాణాలు కోల్పోతున్నారన్న కాన్సెప్ట్‌తో, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ మాట్లాడకూడదన్న సందేశంతో ఈ గణపతిని రూపొందించారు.

పర్యావరణ గణపతి

పర్యావరణాన్ని కాపాడుకోవాలని, ప్లాస్టిక్ కప్పులను వాడరాదని సందేశాన్నిస్తూ 2015లో సుమారు 2,500 పేపర్ టీ కప్పులతో వినాయకుడిని తయారుచేశారు.

మాస్క్ గణపయ్య..

కరోనా వైరస్ విలయతాండవం చేస్తూ ప్రపంచాన్ని వణికించిన వేళ ప్రజలకు మాస్కే ప్రధాన రక్షణ కవచమని సందేశమిస్తూ మాస్కులతో వినూత్నంగా గణపయ్యను 2020లో ప్రతిష్ఠించారు.

వ్యాక్సిన్ విఘ్నేశ్వరుడు

కరోనా తుది దశకు చేరుకున్న సమయంలో వ్యాక్సిన్ ప్రాధాన్యాన్ని తెలియజేస్తూ 2021లో వ్యాక్సిన్ వినాయకుడిని ఆవిష్కరించారు. మండపం వద్ద మాత్రమే కాకుండా నవరాత్రి ఉత్సవాల అనంతరం జీవీఎంసీ ఎదురుగా గల గ్రౌండ్‌లో కూడా కొన్ని రోజులు ఉంచారు.

ప్రకృతి గణపతి

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని, ప్లాస్టిక్‌కు బదులుగా నార, గుడ్డ సంచులు వాడాలని 2022లో గణపతి విగ్రహం ద్వారా సందేశమిచ్చారు హరిప్రసాద్. ఇవే కాకుండా వ్యాట్సాప్ వినాయకుడు, ఓటర్ కార్డ్ వినాయకుడు, ట్రైన్ వినాయకుడు, ఏటీఎం వినాయకుడు.. ఇలా పలు వైవిధ్యభరితమైన ఆలోచనలు, విభిన్న రూపాల్లో గణపయ్యను తయారుచేసి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు యువసేవ ఫౌండేషన్ సభ్యులు.

ఈ ఏడాది ఎలక్షన్ కాన్సెప్ట్‌తో..



చిన్నప్పటి నుంచి వినాయకుడి మీద ఉండే భక్తితో ప్రజలకు సందేశమివ్వాలనే ఉద్దేశంతో వినూత్నంగా మండపం, గణపతిని ఏర్పాటు చేస్తున్నాను. ఈ విషయంలో తల్లిదండ్రుల ప్రోత్సాహం, సహకారం మరువలేనిది. ప్రజలు, అధికారుల ప్రశంసలు మరింత వినూత్నంగా, సందేశాత్మకంగా చేయాలనే ఆలోచనలను నాలో కలిగిస్తున్నాయి. ఆ స్ఫూర్తితోనే ఈ ఏడాది కూడా ఎలక్షన్ కాన్సెప్ట్‌తో గణనాథుడిని సిద్ధం చేస్తున్నాం.

– పీలా హరిప్రసాద్, ఫౌండర్, యువసేవ ఫౌండేషన్, లక్ష్మీనారాయణపురం

శిశుగృహను సందర్శించిన సీనియర్ సివిల్ జడ్జి


శిశుగృహలో దస్త్రాలు పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శేషమ్మ

మద్దిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ దరి శ్రీరాంనగర్‌లోని శిశుగృహను శుక్రవారం సాయంత్రం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి.శేషమ్మ సందర్శించారు. అక్కడ చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. శిశుగృహ సిబ్బందితో సమీక్ష నిర్వహించిన ఆమె దస్త్రాలతోపాటు భవన పరిసరాలను పరిశీలించారు. శేషమ్మ వెంట శిశుగృహ సంరక్షణ అధికారి మమత, మేనేజర్ సుజాత, సోషల్ వర్కర్ రామలక్ష్మి తదితరులు ఉన్నారు.

మందుబాబుకు జైలుశిక్ష

- ఎనిమిది మందికి రూ.50 వేల జరిమానా

సీతమ్మధార: ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన తొమ్మిది మందిని ఐదో స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా.. ఒక్కొక్కరికీ రూ.4 వేల నుంచి రూ.9 వేల వరకు జరిమానా విధించారు. ఎనిమిది మందికి రూ.50 వేల ఫైన్ వేశారు. సీతమ్మధారకు చెందిన మన్యాల శ్రీనివాసుకు(ఆటో ఏపీ31టీఈ7311) ఎనిమిది రోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన డాక్టర్ రమణమూర్తి


వైవీ సుబ్బారెడ్డితో డాక్టర్ రమణమూర్తి

సీతమ్మధార: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనతో కొద్ది సేపు చర్చించారు. ఈ సందర్భంగా 'ఎలా ఉన్నారు డాక్టర్ గారు?' అంటూ వైవీ సుబ్బారెడ్డి ఆప్యాయంగా డాక్టర్ రమణమూర్తిని పలకరించారు.

'గ్రీవెన్స్'కు వినతులు


వినతులు పరిశీలిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో శుక్రవారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మిగిలిన అర్జీలను అధికారులకు పంపి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్‌లోని కప్పరాడ ఉన్నత పాఠశాలలో హిందీ టీచర్ కుసుమ కుమారి నేతృత్వంలో శుక్రవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం విజయమాలి కార్యక్రమాన్ని ప్రారంభించి రాజభాష హిందీ ప్రాముఖ్యాన్ని వివరించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకాలు అలరించాయి. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పి.సీతారాం, ఉప్పల కల్యాణి, రాథో, దుర్గాప్రసాద్, రమణమ్మ, రమణి, సత్యానంద్, జ్యోతి ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

హర్ ఘర్ ధ్యాన్ క్యాంపెయిన్

విశాఖ స్పోర్ట్స్: విశాఖ ఆర్ట్ ఆఫ్ లివింగ్ సహకారంతో ఈకో రైల్వే వాల్తేర్ ఆధ్వర్యంలో శుక్రవారం హర్‌ఘర్ ధ్యాన్ క్యాంపెయిన్ జరిగింది. ఉద్యోగులు, అధికారులకు ధ్యానం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ భాగ్యశ్రీ.. శారీరక ఒత్తిడి రకాలు, ధ్యానం, ధ్యాన క్రియల ద్వారా వాటిని ఎలా అధిగమించాలో వివరించారు. ఏడీఆర్ఎంలు సుధీర్‌కుమార్, మనోజ్‌కుమార్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో ఎదుర్కొనే ఒత్తిడితో కూడిన పరిస్థితులను అధిగమించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. సీనియర్ అధికారి రంజన్ మొహంతి కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వాకర్స్ పార్కులో మట్టి గణేష్ విగ్రహాలను శనివారం పంపిణీ చేస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. ఉదయం 6 గంటలకు విగ్రహాల పంపిణీ, 8 గంటలకు కార్యవర్గ సమావేశం నిర్వహిస్తామన్నారు. మానవ సేవే మాధవ సేవ సంస్థ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలతోపాటు వినాయక వ్రతకల్పం పుస్తకాలను శనివారం సాయంత్రం 4 గంటలకు మురళీనగర్‌లోని కార్తీక్ కూల్ పాయింట్ వద్ద అందజేస్తామని, సంఘ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ చెప్పారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు


ఆర్ అండ్ బీ క్వార్టర్స్‌లో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 14వ వార్డు సీతమ్మధార, ఏఎస్సార్ నగర్(10 861 11) సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. పార్టీలు, కుల, మతాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ పాలనలో విశాఖ నగరం ఎంతో అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ నూకరాజు, వార్డు నాయకులు సత్యనారాయణ, ప్రవీణ్‌వర్మ, ఆదిరెడ్డి అప్పారావు, వరలక్ష్మి, వీరబాబు, బాబ్జీ, ఎం.సునీల్, శ్రావణి, అశోక్, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ


మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార: పర్యావరణానికి మేలు చేసే మట్టి వినాయక ప్రతిమలను భక్తులు పూజించాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేవుట్‌లో శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి ప్రతిమను పూజించాలని.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని పేర్కొన్నారు. ఉత్తర నియోజకవర్గంలో సుమారు 26 వేల మట్టి గణపతులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

సీతంపేట: బీజేపీ అక్కయ్యపాలెం మండలాధ్యక్షుడు మోకిని సత్తిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం సంఘం ఆఫీస్, 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్ వద్ద వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. తన సొంత నిధులతో ప్రతిమలు, పూజా పుస్తకాలు అందజేశారు. ముఖ్య అతిథులుగా పార్టీ నాయకులు ఎం.నాగేంద్ర, ఎస్.వి.ఎస్.ప్రకాష్‌రెడ్డి, నరేంద్ర ప్రకాష్ వాటిని స్థానికులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు జ్యోతిదేవి, అంకారావు, కొండబాబు, లక్ష్మణ్, వై.కొండలరావు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రెనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిదని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. టెక్నో సాఫ్ట్ సొల్యూషన్స్, వోల్టా ప్యాషన్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మ్స్, శ్రీరామ్ ఫైనాన్స్, రిలయన్స్ జియో, వరుణ్ మోటర్స్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, రెడ్డీస్ లేబరేటరీస్, బిగ్‌బాస్కెట్, సెవెన్‌హిల్స్ హెల్త్ కేర్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 873 ఉద్యోగాల భర్తీకి జరిగిన ఇంటర్వ్యూల్లో 241 మంది అభ్యర్థులు హాజరుకాగా.. 104 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి, వారికి సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.


అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారి

30 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం గంజాయితో ఓ వ్యక్తిని జీఆర్పీ అదుపులోకి తీసుకుంది. జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది శుక్రవారం స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫాంలపై అనుమానితుల లగేజీలను తనిఖీలు చేశారు. ఆ సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన శుభంకర్ ఝూను లగేజీని తనిఖీ చేయగా.. అందులో 30 కిలోల గంజాయిని గుర్తించారు. ఒడిశాలోని రంభ నుంచి విశాఖపట్నం మీదుగా ఢిల్లీకి గంజాయి రవాణా చేసేందుకు ఆయన ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని.. గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్పీ ఎస్ఐలు శ్రీనివాసరావు, అప్పలనాయుడు, బాలాజీరావు పాల్గొన్నారు.


నిందితుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

శంకరమఠంలో అయ్యప్ప పూజలు

సీతంపేట: శ్రీపూర్ణపుష్కల అయ్యప్ప సేవా ట్రస్టు, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్థానిక శంకరమఠంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకం, అర్చన, అలంకరణ పూజా కార్యక్రమాలు జరిగాయి. కృష్ణస్వామి, ఫైలా ఆదిమోహన్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజాకార్యక్రమాలలో అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అయ్యప్ప స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


నక్కవానిపాలెంలో పనులు చేయిస్తున్న అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు నక్కవానిపాలెంలోని రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఏఈ శ్రీరామ్మూర్తి పర్యవేక్షణలో ఈ పనులు ప్రారంభించారు. పొక్లెయిన్‌తో రోడ్డు వెడల్పు చేశారు. సత్యం జంక్షన్ నుంచి అల్లూరి సీతారామరాజు జంక్షన్ వరకు 80 అడుగుల రహదారిగా విస్తరిస్తున్నారు. సీతమ్మధార అల్లూరి సీతారామరాజు కూడలి నుంచి హెచ్‌బీ కాలనీ వరకు రోడ్డు పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు


మధురానగర్ హైస్కూల్‌లో పోటీలు ప్రారంభిస్తున్న హెచ్‌ఎం శాంతికుమారి


వాలీబాల్ ఆడుతున్న విద్యార్థినులు

సీతంపేట: స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార మండల స్థాయి ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి జ్యోతి ప్రజ్వలన చేసి పావురాలను గాలిలోకి విడిచిపెట్టి పోటీలు ప్రారంభించారు. అనంతరం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ గ్రౌండ్‌లో తొలి రోజు బాలికలకు పోటీలు నిర్వహించారు. మండలంలోని 12 స్కూళ్ల నుంచి సుమారు 250 మంది విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపారు. శనివారం బాలురకు పోటీలు నిర్వహిస్తామని శాంతికుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీజీవోస్ స్కూల్ హెచ్‌ఎం లక్ష్మీ నరస, పీడీలు సునంద్, తబిత, పీఈటీలు త్రినాథ్, సురేష్, శారద, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీర్ల ఖ్యాతిని చాటిన మహనీయుడు విశ్వేశ్వరయ్య



పాలిటెక్నిక్ కాలేజీలో ప్రసంగిస్తున్న జనరల్ మేనేజర్ చిట్టి గణపతి

మురళీనగర్: దేశ ఇంజినీర్ల ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా చాటిన మహనీయుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చిట్టి గణపతి అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ సివిల్ విభాగంలో శుక్రవారం నిర్వహించిన ఇంజినీర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.డి.వి.నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చిట్టి గణపతి మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతోపాటు సాంకేతిక విద్యపై పట్టు సాధించాలని సూచించారు. సివిల్ హెడ్ జె.రాజేంద్రప్రసాద్, సీనియర్ లెక్చరర్ ఎస్‌వీ రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


గైస్‌లో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు

గైస్‌లో ఘనంగా ఇంజినీర్స్ డే..

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ(గైస్)లో విభాగం హెడ్ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు అధ్యక్షతన ఇంజినీర్స్ డే నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు తమ కోసమే కాకుండా సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని లక్ష్మణరావు ఆకాంక్షించారు. వివిధ డిపార్ట్‌మెంట్ల హెడ్‌లు సీహెచ్ జయప్రకాష్ రెడ్డి, దామోదర్, ఎస్.ప్రశాంతకుమారి, ఓఎస్‌డీ ఎస్.వెంకటేశ్వరరావు ఇతర అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచానికే ఆదర్శం విశ్వేశ్వరయ్య


రిటైర్డ్ ఇంజినీర్లను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

తన సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు ఇంజినీరింగ్ విభాగంలో అద్భుతాలు సృష్టించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తారని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంజినీర్స్ డే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా ఉమ్మడి విశాఖ విశ్రాంత ఈఈ నిమ్మగడ్డ బుచ్చయ్య విశ్వేశ్వరయ్య చిత్రటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ సభ్యులైన ఇంజినీర్లు, పూర్వ అధ్యక్షులు నిమ్మగుడ్డ బుచ్చయ్య, చిలకపాటి కృష్ణమూర్తి, కేజీ కృష్ణారావు, సీహెచ్ కృష్ణమూర్తి, ఆదిభట్ల రామకృష్ణలను ఘనంగా సత్కరించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి రాళ్లపల్లి సత్యనాథం, వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, జాలీవాకర్ ఎస్.ప్రకాశరావు, పి.చెల్వరాజు, వడ్డాది అప్పారావు పాల్గొన్నారు.

ఇంటింటా 'ఆరోగ్య సురక్ష' సర్వే


డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ఆరోగ్య సర్వే చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష 5 విడతలుగా జరుగుతుందన్నారు. మొదటి విడతలో వలంటీర్లు, గృహ సారథులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రజలకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు, అనారోగ్య సమస్య వచ్చినప్పుడు ఏ ఆస్పత్రికి వెళ్లాలో అనే అంశాలు తెలియజేయడంతోపాటు ఉచిత వైద్య సేవల వినియోగంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(ఎంఎల్‌హెచ్‌పీ), ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తల బృందం ప్రజలకు ఇంటి వద్దే ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ఆ వివరాలు మొబైల్ యాప్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఈ వివరాలు హెల్త్ క్యాంపు జరిగే నాటికి ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 30 నుంచి 45 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా హెల్త్ క్యాంప్‌లు జరుగుతాయని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

గణేష్ మండపాలకు అనుమతులు తప్పనిసరి

దొండపర్తి: వినాయక చవితి సందర్భంగా నగరంలో గణేష్ మండపాలు ఏర్పాటు చేయాలనుకునేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో జీవీఎంసీ, కాలుష్య నియంత్రణ శాఖ, అగ్నిమాపక, వైద్య, ఆరోగ్య శాఖ, ఆర్టీసీ, ఏపీఈపీడీసీఎల్, రవాణా, ఏపీ ఫిషరీస్, మెరైన్ పోలీస్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ మట్టి విగ్రహాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల ద్వారా కరపత్రాలను పంపిణీ చేయాలని అధికారులకు సూచించారు.

- ఉత్సవ నిర్వాహకులు ముందుగా వెంకటేశ్వర థియేటర్ పక్కన ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయం 4వ అంతస్తులోని రీజనల్ ఫైర్ ఆఫీసర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్ కోసం స్థానిక ఈపీడీసీఎల్ ఏఈ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. దీంతో సంబంధిత పోలీస్‌స్టేషన్ సీఐను సంప్రదిస్తే అనుమతి ఇవ్వనున్నారు.